సాహితీ సమితి (రంగారెడ్డి జిల్లా వారు 1998 లో) నిర్వహించిన
రాష్ట్రస్థాయి కథల పోటీల్లో బహుమతి పొందిన కథ.

# అగ్నిపూలు

ప్రాయోజకులు

శ్రీ కూర అంతయ్య గారు
సిద్ధిపేట

మున్సిపల్ మాజీ వైస్ చేర్మెన్, సిద్ధిపేట.

మాజీ అధ్యక్షులు, లయన్స్ క్లబ్.

వ్యవస్థాపక పోషక కమిటీ సభ్యులు,
డిగ్రీ కళాశాల, సిద్ధిపేట.

"జగజెట్టి, జాతీయ విప్లవ జ్యోతి, భారతమాత ముద్దుబిడ్డ వీరసావర్కార్ జీవితమొక అగ్నిపూల తోట. ఆ మహనీయుని జీవిత చరిత్రను అందమైన గేయాల్లో తెలుగు పాఠకులకందించిన వర్ధమాన కవి శ్రీ కృష్ణప్రసాద్ ధన్యజీవి. దేశం నాకేమిచ్చిందని నిలదీసేముందు దేశానికి నేనేమిచ్చానని ప్రశ్నించు కోవాలంటుంది సావర్కార్ జీవితం..."

తన కలం నుండి జాలువారిన "సావర్కారీయం" కావ్యాన్నావిష్కరిస్తూ రక్షణ శాఖలో చీఫ్ విజిలెన్సాఫీసర్ జగదీశ్ ఇచ్చిన స్ఫూర్తి సందేశం కృష్ణప్రసాద్ ఉత్సాహాన్ని ఏనుగు మీదెక్కించింది. ఆ మాటలకు రెక్కలొచ్చి ఇంకా ఎదలో ఎగురుతున్నాయి.

నీతినిజాయితీలను ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా భావించే జగదీశ్ తెలుగు వాడనీ, ఈ మధ్యనే ఆపోస్టులో జాయినయాడనీ చలపతి మావయ్య చెప్పాడు. అంత ఎత్తుమీదున్న అధికారి తనను శాలువాతో సన్మానించి వీపు తట్టాడు. "నీలాంటి ఉత్తమ రచయిత నుండి దేశం ఉదాత్తమైన రచనలనాశిస్తుంది. ఇలాంటి దేశ భక్తి కావ్యాలు మరెన్నో రచించి ప్రకటించాలి. అందుకు నా పూర్తి సహకారముంటుంది." అంటూ అభినందించి, విజిటింగ్ కార్డు అందిస్తూంటే ...... హిందూ సామ్రాజ్య పట్టాభిషిక్తుడైన వీరశివాజీలా ఫీలయాడు. దేశ రాజధానిలో తెలుగు సంఘం ఏర్పాటు చేసిన సాహితీ సభలో విదేశాల్లోని తెలుగువెలుగు లెందరో పాల్గొనడం విశేషం.

ఏ.సి. గది, స్పాంజి పరుపు... మెత్తగా, గమ్మత్తుగా ఉంది. విశ్రాంతి తీసుకుంటున్న కృష్ణప్రసాద్‌కు జీవిత చిత్రం మనో యవనిక మీద కదలాడ్తూంది....

అమ్మ తోబుట్టువు చలపతి మావయ్య తనపాలిటి దేవుడే. కలలు కనే వయస్సు రాకముందే కన్నతండ్రి కన్ను మూసినా ఆనాటి నుండి నేటి వరకు అమ్మనూ, చెల్లినీ, తననూ కంటికి రెప్పలా కాపాడుతున్నాడు. ఈగలు దోమలు తోలడంతో పరిపెట్టుకోవాల్సిన తననో ఇంజనీర్‌గా మలిచాడు. మల్లెపూవు లాంటి చెల్లిని మెడిసిన్ చదివిస్తున్నాడు.

రక్షణ శాఖలో ఆర్డనరీ క్లర్క్‌గా చేరి ఆఫీసర్ స్థాయికెదిగిన మావయ్య ఆరేళ్ళ క్రితమే రాష్ట్రరాజధాని నుండి దేశ రాజధాని కొచ్చాడు. అడక్కుండానే నెలనెలా డబ్బు పంపిస్తున్నాడు. కవిత్వం తన హాబీ అని తెలిసి వెన్నుతట్టి ప్రోత్సహించాడు. దాని ఫలితమే "సావర్కరీయం" గేయకథ. సెంట్రల్ పీ.డబ్ల్యూ. డి. లో ఉద్యోగమిప్పిస్తానని ఢిల్లీ రప్పించాడు. అప్లికేషన్ పెట్టించాడు. మరో వారం రోజుల్లో హైదరాబాద్‌కు పోస్టింగ్ రావచ్చు. పుస్తకాన్ని అందంగా అచ్చు వేయించి ఆనందోత్సాహాలతో ఆవిష్కరింపజేశాడు. ఆ సాహితీ సభ తనకో తీపి గుర్తు. అదంతా మావయ్య పలుకుబడి ప్రభావమే.

సభ పూర్తవగానే ఇంటికొచ్చారు. అది మావయ్య సొంత ఇల్లు. ఇల్లు అనేకంటే దీనినో రాజభవనం అంటేనే సబబుగా ఉంటుంది. తనకు కేటాయించిన గదిలో ఏ.సి., ఫోన్. ఎటాచ్డ్ బాత్... అంతా రాయల్టీయే.

ఢిల్లీకొచ్చిన ఆరేళ్ళలో మావయ్య పెద్దకొడుకును సొంత ఖర్చుతో అమెరికా పంపించాడు. చిన్న కొడుకుక్కు ఇంజనీరింగ్ సీటుతో పాటు హాస్టల్ సీటు గూడా కొనిచ్చాడు. అతని వింత మాటల్లో బోలెడంత మాధుర్యముంటుంది. ఆ మాధుర్యమే విదేశాల్లోని ఎందరో తెలుగు వాళ్లతో దోస్తీ సంపాదించి పెట్టింది. అమాత్యులను, అధికారులను ప్రసన్నం చేసుకుని అసాధ్యమైన పనుల్ని సుసాధ్యముగా చేసిపెట్టడములో ఆరితేరాడని అంటారంతా.

ఈరోజు తమవెంట ఇంటికొచ్చిన విదేశీ జంట రాబర్ట్, రోజీలు తెలుగంటే పడిచస్తారని పరిచయమప్పుడు చెప్పాడు. నిజమే... ఏ గడ్డ బిడ్డలో గాని తెలుగులో గడగడా మాట్లాడేస్తున్నారు. వాళ్లకు పై అంతస్తు గది కేటాయించారు.

"ఏం బావా! శూన్యంలొకి అదేపనిగా చూస్తూ చుక్కల్లో చిక్కుకు పోయావా!" పదహారణాల ప్రబంధ నాయికలా వయ్యారంగా అడుగులేస్తూ ముసి ముసి నవ్వులతో భోజనం పట్టుకొస్తూంది మాండవి. చలపతి మావయ్య ఏకైక కూతురు. గారాలపట్టి కాబట్టి తల్లిదండ్రుల్ని బెదిరించుకుంటుంది. ఢిల్లీలోనే డిగ్రీ పూర్తి చేసింది.

"ఎన్ని చుక్కలు ఒక్కచోట చేరినా నీలాంటి చక్కని చుక్కముందు దిగదుడుపేగదా మరదలా!"

"అబ్బో! మాటలు కోవపేడాల మూటల్లాగున్నాయే." గలగలా నవ్వేసింది. ఆ నవ్వులో పున్నమి వెన్నెల వెలుగుంది.

నిగనిగలాడే నిమ్మపండు దేహఛాయ, శిల్పశాస్త్రపారంగతుడైన శిల్పి స్వప్న సుందరిలా రూపుదిద్దుకున్న ఒంపుసొంపులు..... అబ్బో... కుందనబ్బొమ్మలాగైందే.

"హబ్బ! ఎన్నాళ్లకు కనబడ్డావో!" అంటూ భోజనం టేబుల్ మీదుంచి వచ్చి మూతిముడుచుకుని పక్కన కూచుంది.

"అలకలో గూడా అతిలోక సుందరిలాగున్నావు సుమా!" నున్నని బుగ్గ మీద చిన్న చిటికేశాడు. పక్కకు జరిగింది.

"అలకనా గిలకనా! నీ కోసం నేను మూడుసార్లు మనూరొచ్చాను. కనీసం నువ్వొక్కసారన్నా నా కోసంమొచ్చావా?" మూతులు తిప్పింది.

"ఇదిగో... ఇప్పుడొచ్చాను గదా!" నవ్వుతూ తానూ జరిగాడు.

"ఆ ... వచ్చావులే ఒంటిపోగు బ్రాహ్మడిలా. అత్తయ్యను వెంటతీసుకొస్తే ఆ సంగతి గూడా మాట్లాడేవారు గదా!"

"అమ్మ దొంగా, అందుకా!" మరో చెంప గిల్లాడు. "అందుకు ఎందుకు తొందరా!"

"ఓయబ్బో బింకం! నీకుమాత్రం లేదా తొందర?" తెల్లని ముక్కుపుడక చమక్కు, ఎర్రని కుంకుమ బొట్టులో తళుక్కుమంది. చెవిదుద్దుల కదిలిక సోయగాలొలికిస్తూంది.

"అదెంత మాండవీ! ఒక్క ఫోన్ కొడితే మర్నాడు అమ్మ వచ్చి వాలుతుంది. కానీ..." చెంపలందుకున్నాడు. వసంత కోయిలలా నవ్వింది.

"ఆ కానీలోనే ఉంది ఝూమ్మనే తమాషా...." మెల్లగా తప్పుకుని చెయ్యిబట్టి టేబుల్ వద్దకు లాక్కెళ్లింది. ఒకే ప్లేటులో ఇద్దరికి వడ్డించింది.

ముసిముసి నవ్వులు, కసికసి చూపులతో భోజనం ముగిసింది. గోడగడియారం "జాగ్రత్త సుమా!." అన్నట్టుగా పదిసార్లు అరిచింది. మాండవి గబుక్కున లేచింది. మనిషి ముందుకెళ్లాలంటూంటే మనస్సు వెనక్కు లాక్కెళ్లింది. మాండవి వెళ్తూంటే దోరమాగిన మామిడిపండు దోసిట్లోంచి జారిపోతున్నట్టనిపించింది.

వారం కాకపోయినా ఓ నెల రోజుల్లో రాజాలాంటి ఉద్యోగం ఇప్పిస్తాడు మావయ్య. రెండో నెలలో మాండవి మెడలో మూడుముళ్లేసి నాలుగు కాలాలపాటు హాయిగా గడపొచ్చు.... తియ్యని ఊహలు. మాండవి స్పర్శ రగిలించిన వేడి... నిద్ర రావడం లేదు. పన్నెండైంది. కాస్సేపు మేడమీద కళ్లాలు లేని గాలిలో తిరిగొస్తే...

మేడమీద రకరకాల పూలమొక్కలు తలలాడిస్తూ స్వాగతం పలికాయి. నైట్‌క్వీన్‌లు నవ్వులు రువ్వుతున్నాయి. ఆహా... హాయిగా, ఉల్లాసంగా ఉంది. దృష్టి పక్కకు వెళ్లింది. విదేశీ జంట కిటికీలు సగం తెరుచుకున్నాయి. మంద్ర స్థాయిలో మాటలు వినబడుతున్నాయి. ఇంత రాత్రి దాకా ఈ జంట ఏం చేస్తున్నట్టూ! ఆసక్తి అల్లరి పెట్టింది. అనుకోకుండా కాళ్లు అటువైపు కదిలాయి. కిటికీ పక్కన నుంచున్నాడు. ట్యూబులైటు వెలుతురు అంతా చూపిస్తుంది.

"థాంక్యూ మిస్టర్ చలపతీ! మేమడిగిన డాక్యుమెంట్లు, మ్యాపులు చాలా అందించారు." రాబర్ట్ రంగు కాగితాలు తిరగేస్తున్నాడు. "దీంతో మీ కంట్రీ సీక్రెట్స్ మాకెన్నో తెలిసాయి. వీ ఆర్ వెరీ గ్రేట్‌ఫుల్ టూ యూ. కానీ... ఇంత ఇంపార్టెంట్ డాక్యుమెంట్ల కాపీలు ఎలా సంపాదించ గలిగారూ?"

"మనసుంటే మార్గాలెన్నో సార్! ఇవేమిటీ, ఇంకే డాక్యుమెంట్ల కాపీలైనా సంపాదించగలను. కానీ.... " చలపతి ఆశగా చూచాడు.

"నోనో... ఆ కానీ గీనీలొద్దు." రోజీగాజుకళ్లు పూవుమీది తేనెటీగల్లా కదిలాయి. "ఇదిగో ఇదుంచుకోండి. ఇండియన్ కరెన్సీలో ఇరవై లక్షలు... " బ్రీఫ్ కేస్ అందించింది.

"ఈ పనుల కోసమే మేము తెలుగు నేర్చుకుని భార్యాభర్తలుగా నటిస్తున్నామని మీకు తెలుసుగదా!" రాబర్ట్ మందహాసం. "మరికొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లు..." అడిగాడు.

"సరే... కానీ.... కా...నీ... "

"మీకేం కావాలో మొహమాటపడకుండా చెప్పండీ."

"స్విస్ బాంక్‌లో నాకో కాతా..."

"ఓస్... అదెంత పనీ. దానికి సంబంధించిన పేపర్స్ తెచ్చాను. వీటి మీద మీరు సంతకం పెట్టిస్తే ఈసారి ఇచ్చే రెమ్యునరేషన్ స్విస్ ఎకౌంటులోనే జమైపోతుంది." మరో బ్రీఫ్‌కేస్‌లోంచి కాయితాలు తీసి వాటిమీద సంతకాలు తీసుకున్నాడు రాబర్ట్.

"హమ్మయ్యా! నా ఆశ నెరవేరబోతుంది." తృప్తిగా నిట్టూర్చాడు చలపతి.

"మేమడిగిన డాక్యుమెంట్లు ఇట్లా ఇస్తూఉంటే మీ స్విస్‌బాంక్ బ్యాలెన్సు బోలెడంత పెరుగుతుంది సుమా!" చలపతి చెంప మీద చిటికేసింది రోజీ.

ముగ్గురూ నవ్వేశారు. చీర్స్ అంటూ విస్కీగ్లాసు లందుకున్నారు. ఆ విస్కీ ఎర్రగా... భారతమాత నరాలు కోసి పిండిన రక్తంలా నవనవలాడ్తూంది.

విస్కీ చప్పరిస్తున్నారు. రోజీ నాజూగ్గా లేచింది. ట్యూబ్‌లైటు ఆర్పేసి పచ్చని లైటు వేసింది. పచ్చని వెలుతురులో ఎర్రని విస్కీ... కాషాయ కాంతిపుంజం... సనాతన ధర్మానికి ప్రతీక. ధర్మాన్ని చప్పరిస్తున్నారు. ధైర్యంగా మింగేస్తున్నారు.

"అదృశేగానీ మీకొత్త చీఫ్‌విజిలెన్స్ మిస్టర్ జగదీశ్ వెరీ సిన్సియరనీ, పులిలాంటి వాడనీ విన్నాం. ఆయన్నెలా సరెండర్ చేస్కుంటారు?" చలపతి భుజమ్మీద చెయ్యేసి పక్కన కూర్చుంది రోజీ.

"శతకోటి పాపాలకు అనంతకోటి ఉపాయాలు... చాకచక్యంతో పులిని పిల్లిగా మార్చడం నా హాబీ!" గర్వంగా నవ్వేశాడు. "ఒక్క దెబ్బకు రెండు పిట్టలు పడగొట్టడం నా హాబిట్."

"అంటే..." రోజీ కళ్లల్లో రంగుల మత్తు.

"జగదీశ్‌కు సాహిత్యం పిచ్చి ఉంది. దాన్నే ఆసరాగా తీసుకున్నాను. నా మేనల్లుడు రాసిన పుస్తకాన్ని మూన్నాల్గు రోజుల్లో ప్రింటు చేయించాను. జగదీశ్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేసి కళ్లు జిగేలుమనే మెమెంటోతో సన్మానించాను. పూబోణికి లొంగని వారుండొచ్చుగాని పూలదండకు లొంగనివారుంటారా? ఇదే విధంగా మరో అకేషన్ అరేంజ్ చేసి అతన్ని లోబరుచుకుంటాను. విశ్వాసపాత్రుడినై చెవుల పిల్లిలా మార్చేస్తాను."

"వెరీ వెరీ ఇంటలిజెంట్. మీరసలు మాలా ఇంటలిజెంట్ డిపార్ట్‌మెంట్‌లో పంజెయ్యాల్సిన వారు." రాబర్ట్ నవ్వు గజిబిజిగా ఉంది. "మీరో సూపర్‌మాన్ అని మాకు దెల్సు. రిటైరయ్యేలోగా మేమడిగినవన్నీ ఇస్తూ శేషజీవితం ఆదిశేషుని మీద పవళించిన ఆదివిష్ణులా గడపండి." భుజాలెగరేశాడు.

అబ్బో! పోలిక ఎలాగున్నా, భాషాజ్ఞానం బ్రహ్మాండంగా ఉందే!

"అదే ప్రయత్నంలో ఉన్నాను. పుస్తకాన్ని ఢిల్లీలో ఆవిష్కరించి నా మేనల్లుణ్ని వెలుగులోకి తెచ్చాను. వాడినిప్పటికే ఇంజనీర్‌గా తయారుచేసి నాకూతురుకు తగిన భర్తగా మలిచాను. ఇహ వానికుద్యోగం రావడమే ఆలస్యం. నాకూతురుతో పెళ్లైపోతుంది. ఇహనాకెలాంటి దిగులూ లేదు. మీ లాంటి ఫ్రెండ్స్ నాకు మరికొన్ని దేశాల్లో ఉన్నారు. కోఆపరేషన్‌తో నామనవలు మునిమనవల దాకా తరిగి పోని ఆస్తి సంపాదిస్తాను...!" కడుపారా నవ్వేశాడు. ఆ నవ్వులో, కళ్లల్లో క్రౌర్యం ఛాయలున్నాయి.

"ఓ..కే... చలపతీ!" రోజీ పెదాలందించబోయింది. "ఇకచాలు" అంటూ దిగ్గున లేచాడు చలపతి "మనం ఎక్కువగా తాగితే చిక్కుల్లో పడతాం".

కృష్ణప్రసాద్ బుర్ర భూగోళంలా తిరిగింది. పదంతస్తుల మేడమీంచి పాతాళంలోకి జారి పడ్తున్నట్టుంది.

అన్యాయం, అక్రమమం, అమానుషం... గుండె ఘోషించింది. అంగలేస్తూ దిగి అరక్షణంలో గదిలోకొచ్చాడు.

తండ్రి లాంటి మావయ్య తలలు నరికే మేకవన్నె పులా! అతని తలలో జేజమ్మ ఇలా పంజేస్తుందా! దేశాన్ని రక్షించాల్సిన వారే ఇలా భక్షిస్తూంటే దేశం గతేమైపోతుంది? ఆరేళ్లలో అపారమైన ఆస్థుల సంపాదన రహస్యమిదన్నమాట. ఈ రహస్యాల ఆధారంగానే ఆ దేశం ఈ దేశాన్నాక్రమిస్తే ఈయన ఆస్తులనెవడు రక్షిస్తాడు?... ఒళ్లంతా కంపరమెత్తింది.

మహాసముద్రం లోతు తెలుసుకోవచ్చుగాని మనిషి లోతు తెలుసుకోలేమన్నారందుకే. దిక్కులేని పక్షులమైన మమ్మల్ని కాపాడుతున్న మావయ్య, దేవకన్యలాంటి తన కూతుర్ని నాకు కట్టబెడుతున్న మావయ్య... అయ్యో భగవాన్! ఇది తగదని నేను చెబితే వింటాడనే నమ్మకం లేదు... ధనపిశాచి విననివ్వదు. ఆ మత్తు స్వ, పర బేధాలను పాటించదు. ఎత్తువేసి నాప్రాణాలు తీయొచ్చు. కాని... ప్రాణం కన్న దేశం మిన్న. కర్తవ్యాన్ని మరిస్తే భావికాలం కాలసర్పమై కాటేస్తుంది.

జేబులున్న జగదీశ్ విజిటింగ్ కార్డు చేతిలోకొచ్చింది. ఫోన్ నెంబర్లు చకచకా తిరిగినై. ధారలై కళ్ల ద్వారా వెలువడుతున్న హృదయవేదనను చేతిగుడ్డతో అద్దుకుంటూ అంతా చెప్పేశాడు.

అరగంటలో జగదీశ్ బృందం మెరుపుదాడి. సోదా జరిగింది. చలపతి, విదేశీ జంట, రహస్య పత్రాలతో రెడ్‌హాండెడ్‌గా పట్టుబడ్డారు. తెల్లవారకముందే చలపతి తెలివి తెల్లారిపోయింది.